నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 1 మే 2024 | ADILABAD NIRMAL



▲ మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

# కార్యకర్తలే మా బలం

- కష్టపడి పని చేద్దాం.. బీఆర్ఎస్‌ను గెలిపిద్దాం..
- మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్
- ఆత్రం సక్కు, జోగు రామన్న, భూక్యా జాన్సన్ నాయక్
- కొండుకూర్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశం

కడెం, ఏప్రిల్ 30 : కార్యకర్తలే మా బలం.. బలగం అని, వారు లేకుంటే నాయకులు లేరని.. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ గద్దె నెక్కిందని, రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, మర్సుకోల సరస్వతిలు పేర్కొన్నారు. మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్రం సక్కును గెలిపించుకుందామని పేర్కొన్నారు. సమావేశంలో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

**బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సక్కు**

ఖానాపూర్, ఏప్రిల్ 30 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సక్కు పేర్కొన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హామీల పేరిట ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, గతంలో ఎంపీగా అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ప్రజల కోసం చేసింది ఏమి లేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రైతులు, ఉద్యోగులు, వ్యవసాయ కూలీలను ఆగం చేసిందని అన్నారు. రుణమాఫీ, పింఛన్, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు రైతుబంధు, క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్, కల్యాణ లక్ష్మికి తులం బంగారం వంటి పథకాల హామీలు ఎక్కడని ప్రజలు నిలదీయాలని సూచించారు. ప్రజలను మోసం చెసిన కాంగ్రెస్ పార్టీని గద్దెదించాలని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్సుకోల సరస్వతి, నాయకులు గౌరికర్ రాజు, రాజగంగన్న, రామునాయక్, నారాయణ, శ్రీనివాస్, మల్లేశ్, ప్రదీప్, రాజన్న పాల్గొన్నారు.

# బాలికలే టాప్

- 'పది' ఫలితాల్లో మెరిసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా..
- రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా నంబర్ వన్ స్థానం
- గతేడాది శత శాతం ఉత్తీర్ణత.. ఈ యేడాది 99.05 శాతం..
- 188 మందికి 10 జీపీఏ.. 71 బడుల్లో శత శాతం ఉత్తీర్ణత..

TENTH RESULT

1 వ స్థానం నిర్మల్ | 17 వ స్థానం ఆదిలాబాద్ | 20 వ స్థానం మంచిర్యాల | 31 వ స్థానం ఆసిఫాబాద్

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఫలితాలు

| జిల్లా | హాజరైన విద్యార్థులు | బాలుర ఉత్తీర్ణత | బాలికల ఉత్తీర్ణత | ఉత్తీర్ణత శాతం |
|---|---|---|---|---|
| నిర్మల్ | 8,908 | 4,246 | 4,577 | 99.05 |
| ఆదిలాబాద్ | 10,374 | 4,744 | 4,897 | 92.93 |
| మంచిర్యాల | 9,283 | 4,338 | 4,241 | 92.42 |
| ఆసిఫాబాద్ | 6,393 | 2,366 | 2,959 | 83.29 |



నిర్మల్ అర్బన్ : కేక్ కట్ చేస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, డీఈవో రవీందర్‌రెడ్డి, అధికారులు

మంచిర్యాల ప్రతినిధి(నమస్తే తెలంగాణ)/నిర్మల్ అర్బన్/ఎదులాపురం, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మెరిసింది. చదువుల తల్లి బాసర సరస్వతీ కొలువుదీరిన నిర్మల్ జిల్లా గతేడాది మాదిరిగానే ఈ యేడాది అత్యధిక ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. గతేడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ సంవత్సరం 99.05 శాతంతో టాప్‌లో నిలిచింది. ఆదిలాబాద్ జిల్లా 17, మంచిర్యాల 20, కుమ్రం భీం ఆసిఫాబాద్ 31వ స్థానంలో నిలిచాయి. నిర్మల్ జిల్లాలో 8,908 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో బాలురు 4,246 (98.74 శాతం), బాలికలు 4,577(99.33 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో 85 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో 10,374 మంది పరీక్ష రాయగా.. బాలురు 4,744(91.60 శాతం), బాలికలు 4,897(94.26 శాతం) పాస్ అయ్యారు. మంచిర్యాల జిల్లాలో 9,283 మంది ఎగ్జామ్ రాయగా.. బాలురు 4,338(91.36 శాతం), బాలికలు 4,241(93.52శాతం) మంది అర్హత సాధించగా 704 మంది పరీక్షల్లో తప్పారు. ఇక ఆసిఫాబాద్ జిల్లాలో కింది నుంచి మూడో స్థానంలో నిలిచింది. 6,393 మంది పరీక్షలు రాస్తే బాలురు 2,366(78.66 శాతం), బాలికలు 2,959(87.42 శాతం) పాస్ అవ్వగా.. 1,068 మంది ఫెయిల్ అయ్యారు. నాలుగు జిల్లాల్లోనూ అమ్మాయిలే సత్తా చాటారు. అబ్బాల కంటే అధిక ఉత్తీర్ణత సాధించారు.

## 188 మందికి 10 జీపీఏ.. 71 స్కూల్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత..

మంచిర్యాల జిల్లాలో 188 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. స్థానిక సంస్థల స్కూల్స్‌లో ముగ్గురు, మహాత్మా జ్యోతిబా పూలే స్కూల్స్‌లో 10 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 160 మంది, మైనార్టీ రెసిడెన్షియల్స్‌లో ఒక్కరు, మోడల్ స్కూల్స్‌లో ఐదుగురు, రెసిడెన్షియల్ బడుల్లో ఒక్కరు, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో ఎనిమిది మంది 10 జీపీఏ సాధించారు. జిల్లావ్యాప్తంగా 71 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. స్థానిక సంస్థల స్కూల్స్ 21, మహాత్మా జ్యోతిబా పూలే బడులు ఐదు, ప్రైవేటు పాఠశాలలు 29, మైనార్టీ రెసిడెన్షియల్స్ రెండు, మోడల్ స్కూల్స్ రెండు, రెసిడెన్షియల్ ఒకటి, కేజీబీవీలు మూడు, ఎయిడెట్ ఒకటి, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు నాలుగు, వెల్ఫేర్ స్కూల్స్ మూడు చొప్పున 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## పోలింగ్ స్టేషన్‌లో వసతులు కల్పించాలి..



మాట్లాడుతున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్

ఇచ్చోడ, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లలో అన్ని వసతులు కల్పించాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను బోథ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా అధికారులు పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ గాజుల తుకారం, ఎంపీడీవో లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్ రామారావ్, ఆర్ఐ హుస్సేన్, బీఎల్‌వో సూపర్‌వైర్ నూర్‌సింగ్, గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ ఉన్నారు.



ఆదిలాబాద్ పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



నేరడిగొండ మండలంలోని ఈస్‌పూర్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# ప్రచార హోరు

- విస్తృతంగా గులాబీ శ్రేణుల క్యాంపెయిన్
- బీఆర్ఎస్ పథకాలు.. కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాల వివరణ..
- ప్రజల నుంచి విశేష స్పందన

ఆదిలాబాద్, ఏప్రిల్ 30(ఆదిలాబాద్) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతున్నది. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి 12 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. ప్రధాన పార్టీలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య పోటీ ఉంది. ఇటీవల ఆదిలాబాద్‌లో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గ పరిధిలోని 2,111 బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఖానాపూర్, నిర్మల్, మథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలు ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు మే 13వ తేదీన జరుగనుండగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండుటెండలను లెక్క చేయకుండా గడప గడపకూ ప్రచారం చేస్తున్నారు. పట్టణాల్లో వార్డు కమిటీలు, గ్రామాల్లో గ్రామ కమిటీలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

## ప్రజల నుంచి స్పందన

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. రాష్ట్రంలో పది సంవత్సరాలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర నెలలు గడిచినా అసెంబ్లీ ఎన్నికల్లో వారు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడంతోపాటు రైతుబంధు, తాగు, సాగునీటి సమస్యలను ప్రజలకు తెలియ చేస్తున్నారు. ఇటీవల ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా నిర్వహించిన జనజాతర సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆ సభకు జనం తక్కువ సంఖ్య లో వచ్చారు. సీఎం మాట్లాడుతుండగానే వెనుదిరిగారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు గెలిచినా కేంద్రం పెండింగ్‌లో ఉన్న ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ కూడా జిల్లా సమస్యలపై మాట్లాడకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి గురి చేసింది. వేలాది మందికి ఉపాధి కల్పించే ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభం, విమానాశ్రయం ఏర్పాటు, ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలేన్, నవోదయ స్కూల్ వంటి సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బీజేపీ అభ్యర్థికి కేంద్రం పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టులు, కాంగ్రెస్ అభ్యర్థికి ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు మైనస్‌గా మారుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి అత్రం సక్కు పార్లమెంట్ పరిధిలోని నాయకులతో కలిసి పకడ్బందీ ప్రణాళిక రూపొందించి ప్రచారం నిర్వహిస్తున్నారు.

# అంతర్గత బదిలీల్లో రాజకీయం

- చక్రం తిప్పుతున్న బాసర ఆలయ ఏఈవో
- ఇటీవల పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఫిర్యాదు



మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న బాసర గ్రామస్తులు(ఫైల్)

బాసర, ఏప్రిల్ 30 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ ఆలయంలో ఇటీవల అంతర్గత బదిలీలు జరిగాయి. ఆలయ ఈవో విజయరామారావు రాజకీయ ఒత్తిళ్లతోనే అంతర్గత బదిలీలు చేశారని విశ్వసనీయ సమాచారం. తమకు అనుకూలమైన వారికి మంచి చోటుకు బదిలీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ బదిలీల్లో కొందరు రాజకీయ నాయకులకు ముడుపులు ముట్టాయని సమాచారం. ఆలయంలో ఏఈవో కీలక పాత్ర పోషిస్తూ కొన్ని విభాగాల నుంచి రోజువారీగా ముడుపులు ముట్ట జెప్పున్నారు. గదుల విచారణ, వీఐపీ దర్శనాల విభాగం, లడ్డూ స్టోర్ నుంచి పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేస్తూ రోజువారీగా సదరు ఏఈవో కనుసైగల్లో నడిపిస్తున్నారు. ఇటీవల దేవాదాయశాఖ విజిలెన్స్ అధికారిణి కృష్ణవేణి రికార్డులను పరిశీలించినప్పుడు పెద్ద ఎత్తున స్టాక్ లేక పోవడంతో సదరు అధికారిణి కంగుతిని నివేదికను దేవాదాయ శాఖ కమిషనర్‌తోపాటు ప్రభుత్వానికి అందజేశారు. అయితే కొందరిని సస్పెండ్ చేయాలంటూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ తమ పలుకుబడితో రాజకీయ నాయకులకు ముడుపులు ముట్టజెప్పి ఆపుకున్నారు.

## మంత్రి సీతక్కకు ఫిర్యాదు

ఈ విషయంపై బాసరను సందర్శించిన మంత్రి సీతక్కకు అవినీతి ఆరోపణలు ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఈవో విజయ రామారావు, ఏఈవోతోపాటు ఇద్దరు సిబ్బందికి చార్జీ మెమోలను జారీ చేశారు. ఇటీవల ఆలయంలో లడ్డూ స్టోర్‌లో జరిగిన ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

## ఏఈవో ట్రాన్స్‌ఫర్ ఎలా ఆగింది?

బాసర ఆలయంలో పని చేస్తున్న సుదర్శన్ గౌడ్ 2020 లో బాసర ఆలయానికి డిప్యూటేషన్‌పై వచ్చాడు. ఈయనపై కొమురవెల్లిలో పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆయనను కొమురవెల్లి నుంచి బాసరకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఇక్కడ కూడా అవినీతి పనులు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అతని అవినీతి ఎక్కడ బయటకు వస్తాయోనని గత నెలలో ట్రాన్స్‌ఫర్ చేయాలంటూ కమిషనర్‌కు వినతి పెట్టుకున్నాడు. కాగా.. కొమురవెల్లిలోని ఓ కాంగ్రెస్ నాయకుడు ఆ అధికారి మా కొద్దు అంటూ కమిషనర్‌కు తెలుపడంతో ఆయన ట్రాన్స్‌ఫర్‌ను రద్దు చేశారు. డిప్యూటేషన్‌పై వచ్చి ఇంత కాలంగా ఇక్కడే పని చేయడం, అంతకు ముందు పని చేసిన కొమురవెల్లి, ఇప్పుడు పని చేస్తున్న బాసర అమ్మవారి ఆలయంలో అవినీతి, అక్రమాలు చేస్తున్నారనే గ్రామస్తులు ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదంతా కూడా ఏవోకు తెలియకుండానే జరుగుతుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న

# బీజేపీ, కాంగ్రెస్‌లు చేసిందేమి లేదు..

**- మాజీ మంత్రి జోగు రామన్న**

జైనథ్, ఏప్రిల్ 30 : తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి పాలిత కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేసిందేమి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న విమర్శించారు. మంగళవారం బెల్గావ్ గ్రామంలో నిర్వహించిన పార్టీ క్రియాశీలక కార్యకర్తలు, ప్రధాన నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ గోవర్ధన్, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ లింగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింగ్‌రావ్, గణేశ్, ఊశన్న పాల్గొన్నారు.

# ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా



ఎస్ఈ కార్యాలయం ప్రధాన గేటు ఎదుట మృతదేహం ఉన్న వాహనంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

ఎదులాపురం, ఏప్రిల్ 30 : కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన జూనియర్ లైన్‌మన్ పవన్ కల్యాణ్ మృతదేహంతో తల్లిదండ్రులు లక్ష్మి, బుచ్చన్న, చెల్లి కొమల, బంధువులు కలిసి ఆందోళనకు దిగారు. ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో సోమవారం విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా కరెంట్ సప్లయ్ కావడంతో స్తంభంపై నుంచి కింద పడి మృతి చెందాడు. అయితే తమకు న్యాయం చేయాలని కల్యాణ్ కుటుంబ సభ్యులు, మిత్రులు ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్ఈ ప్రధాన గేటు ఎదుట మృతదేహంతో అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ సీఐ సత్యనారాయణ అక్కడికి చేరుకున్నారు. అలాగే నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు అంజేకుమార్, మందపల్లి శ్రీనివాస్, వెంకటేశ్, రాంకుమార్, మురళి, వేణులు మద్దతు తెలియజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేసేదాక ఆందోళన చేస్తామన్నారు. జూనియర్ లైన్‌మన్ సంఘం తరపున రూ.2 లక్షలు, లైన్‌మన్ తరపున రూ.3 లక్షలు ఇస్తామని విద్యుత్ శాఖ డీఈటీ ఈరన్న తెలిపారు. అలాగే సంస్థ పరంగా వచ్చే రూ.5 లక్షలు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించామని పేర్కొన్నారు. అధికారులు బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంలో ఆందోళన విరమించారు.

## విధుల్లో చేరిన నెల రోజుల్లోనే..

రామకృష్ణపూర్‌కు చెందిన బుచ్చయ్య-లక్ష్మి దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఒక కూతురు కోమల ఉండగా పెళ్లి అయింది. కుమారుడు పవన్ కల్యాణ్‌కు ఉద్యోగం వచ్చాక వివాహం చేయాలనుకున్నారు. బుచ్చయ్య తనకున్న కొద్ది భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. నెల కిందట ఆదిలాబాద్‌లో పవన్ కల్యాణ్‌కు జూనియర్ లైన్‌మన్‌గా ఉద్యోగం వచ్చింది. దీంతో తమ కష్టాలు దూరమయ్యాయని సంతోషించారు. అయితే విధి వక్రీకరించి విద్యుదాఘాతంతో ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటాన్ని కుటుంబసభ్యులు తట్టుకోలేక పోతుందన్నారు.

## గ్రూప్-1ను పకడ్బందీగా నిర్వహించాలి..

**టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి**



వీసీలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అధికారులు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 30 : జూన్ 9వ తేదీన నిర్వహించే గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లను పూర్తి చేయాలని టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని టీఎస్పీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 10వ తేదీలోపు కేంద్రాలను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఆర్డీవో లేదా ఆ స్థాయి అధికారులు ప్రత్యక్షంగా కేంద్రాలను తనిఖీ చేసి, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లలో నీటి లభ్యత వంటి సౌకర్యాలు తనిఖీ చేసి ఎంపిక చేయాలని తెలిపారు. ప్రతి మూడు నుంచి ఐదు కేంద్రాలకు ఒక తహసీల్దార్ స్థాయి అధికారిని ఫ్లయింగ్ స్క్వాడ్ గా నియమించాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులతో చర్చించి పరీక్ష రోజు అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా సరిపడినన్నీ ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. కేంద్రాల వద్ద ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్నకల్యాణి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గంజాయిని దహనం చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

# రూ.37 లక్షల గంజాయి కాల్చివేత

**- ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 30 : ఆదిలాబాద్ జిల్లాలోని పదకొండు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సీజ్ చేసిన 150 కిలోల నిషేధిత గంజాయిని మంగళవారం తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామ శివారులో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దాహనం చేశారు. దహనం చేసిన గంజాయి విలువ సుమారు రూ.37 లక్షలు ఉంటుందని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. పోలీసులు కోర్టు అనుమతి తీసుకుని దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లోని నియమ నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లో నిల్వ ఉన్న గంజాయిని దహనం చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ సురేందర్ రావ్, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నేటి నుంచి శిక్షణ

ఎదులాపురం, ఏప్రిల్ 30 : పీవో, ఏపీవో, ఓపీఓలకు బుధ, గురువారాల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో మాస్టర్ ట్రెయినర్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పోలింగ్ రోజు చేయవలసిన పనులు, ఈవీఎంల ప్రాక్టీస్, మధ్యాహ్నం 17 సీ, పీవో డైరీ, మాక్ పోల్ సర్టిఫికెట్ ఏవిధంగా పూరించాలి వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలను ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోథ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇచ్చోడ, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, ఉట్నూర్, నిర్మల్, భైంసా, ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తదితరులు పాల్గొన్నారు.